# మందుల వాళ్ళు

ఈ కళారూపంలో హాస్యరసం ఎక్కువ ఉంటుంది. వీరిచ్చే మందులు రోగియొక్క జబ్బును తగ్గించేవిగాకాక, రోగాన్ని పుట్టించి, పెంచి రోగిని చంపేవిగా ఉంటాయి. ఉదాహరణకు : వడిగల వాతజ్వరానికి నిలువుననోక గడ్డపార నిప్పనగాల్చి తడబడక ఏడుసుట్లు తిప్పి మూడువాతలు పెడితే జ్వరం వదలిపోతుంది. అలాగే కంటిలో దురదులున్నా, కంటిలో నీరుకారుతున్నా కంట్లో పులుకులుకడుతున్నా మిరపకాయ టక్కున పనిసేత్తాది. అంతేకాదు దీనితో జీడిపిక్క, పైతుత్తిరి, జిల్లేడుపాలు సమపాళంలో రంగరించి కొండమిరియ పండు కొద్దిగాదెప్పించి సన్నికంటిమీద సాగునూరి జొన్నగింజంతమాత్ర జోడించి కంటిలో వేస్తే కన్నుపోయి యెలక కన్నమగును. ఇంకా నల్లమందు తెచ్చి నాభితో మర్దించి మైలుతుత్తంతో మాత్రగట్టి కొండనాలికమీద గోరంత పెడితే వున్న నాలిక తెగి వూడిపడుతుంది.

వీరివేషం : నడుముచుట్టు గుడ్డకట్టుకొని, యెదర గోచీలా పెట్టుకొని, మెడలో నలుపు తెలుపు పూసలు మగపాత్రధారికి, స్త్రీ వేషానికి నాలుగయిదు దండలు మెడలో వేసుకుంటారు. వీరు తమ మందులకులం పుట్టుక గురించి ఈ విధంగా చెప్ప కుంటారు :

పరీక్షత్ మహారాజు తపస్సుచేసుకొనే మునిమెడలో పాముపేయుట, అది చూసి ఆ ముని కుమారుడు ఆ పామును తన తండ్రిమెడలో వేసినవాడు పాముకాటుచేత చచ్చునని శపించుట. తర్వాత జనమేజయుడు తండ్రికి వంటిస్తంభం మేడ కట్టించి సర్పయాగం చేయటం, పాములన్నీ అగ్నిగుండంలో పడటం, తక్షకుడు మారువేషంలో వచ్చి రాజును కాటువేయడం ఆ సమయంలో మందులవాళ్ళు మందులు తీసికొనివెళ్లుటము ఆలశ్యం ఆగుటవల్ల రాజుగారికి విషమెక్కి మరణించే స్థితిలో సమయానికివచ్చి ప్రాణం రక్షించలేదు కావున రాజుగారు వీరు ఉండే ఇళ్లన్నీ గుడిసెలు కావాలని, ఏనుగులు, గుర్రాలు, గాడిదలు, పందులు కావాలని వంటిమీదున్న ఆ నవరత్నహారాలు పూసలు అయిపోవాలని, ఊరికి కోసెడుదూరంలో ఉందురని శపించుటవల్ల ఈ విధముగా మందులవాళ్లుగా జన్మించి భిక్షమెత్తుకుంటున్నారని చెబుతారు.

ఈ కళారూపానికి సాంఘిక ప్రయోజనం లేకపోయిన కళాకారులు హాస్యము పండించి ప్రేక్షకులను ఆనందింపచేస్తారు.